సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్‌నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

గ్రీన్‌బెల్ట్‌లు కనుమరుగు

- నిరుపయోగంగా గ్రీన్‌బెల్ట్ గ్రిల్స్
- పాత వాహనాల పార్కింగ్‌తో శానిటరీ సిబ్బందికి ఇబ్బందులు
- చోరీకి గురవుతున్న ఇనుప గ్రిల్స్, ఓపెన్ జిమ్ సామగ్రి
- స్పందించని జోన్ ఇంజినీరింగ్ అధికారులు..


ఊర్వశికూడలిలో గ్రీన్‌బెల్ట్‌లో వ్యర్థాలు


కంచరపాలెం శ్రీనగర్‌కు వెళ్లే రహదారిలో అసంపూర్తిగా వదిలేసిన గ్రీన్‌బెల్ట్ పనులు


జోగారావునగర్‌కు ఆనుకుని గ్రీన్‌బెల్ట్‌లో స్క్రాప్ వ్యాపారాలు


రవీంద్రనగర్‌లో శిథిలావస్థలో గ్రీన్‌బెల్ట్ రహదారి


వివేకానందవీధి గ్రీన్‌బెల్ట్‌లో పశువులను కట్టిన దృశ్యం

కంచరపాలెం: కూటమి ప్రభుత్వం 'పచ్చదనం–పరిశుభ్రత'పై దృష్టి సారించినప్పటికీ, కంచరపాలెంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రీన్‌బెల్ట్‌లు, వాకింగ్ ట్రాక్‌లు మరియు ఓపెన్ జిమ్‌లు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయిన ఈ పనులు, ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయాయి. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా, పనులు తిరిగి ప్రారంభించకపోవడంతో ఈ ప్రాంతాలన్నీ శిథిలావస్థకు చేరాయి.

శిథిలావస్థకు చేరిన నిర్మాణాలు: రెడ్డికంచరపాలెం, ధర్మానగర్, తిక్కవానిపాలెం, వివేకానందనగర్, రవీంద్రనగర్, దేవేంద్రనగర్‌కు వెళ్లే మార్గాల్లో ఉన్న ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు దెబ్బతిన్నాయి.

గ్రిల్స్ చోరీ: గ్రీన్‌బెల్ట్‌లకు రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌ను నిర్లక్ష్యంగా వదిలేయడంతో అవి దొంగల పాలవుతున్నాయి.

వ్యాపారాలు: కొన్ని చోట్ల గ్రిల్స్‌ను తొలగించి, వాటి స్థానంలో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ జోన్–5 ఇంజినీరింగ్ అధికారులకు స్థానికులు అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాకర్లు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తి పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

అసంపూర్తి పనులు చేయాలి...



కంచరపాలెం జాతీయ రహదారిలో నిర్మించిన గ్రీన్‌బెల్ట్‌లో ఇనుప గ్రిల్స్ అధ్వానంగా మారాయి. పనులు నిలిపివేయడంతో రక్షణ గ్రిల్స్ అసంపూర్తి వదిలేశారు. గ్రీన్‌బెల్ట్‌లో పనులు ప్రారంభించి గ్రీన్‌బెల్ట్‌లకు ఓపెన్ జిమ్‌లకు రక్షణ కల్పించాలి. వాకింగ్ చేయాలంటే రోతపుడుతోంది. గ్రీన్ బెల్ట్ పరిసరాలు అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది.

– జామి కరుణ, ధర్మానగర్, కంచరపాలెం

నిర్లక్ష్యంగా వదిలేశారు



జోన్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో జాతీయ రహదారిలో గ్రీన్‌బెల్ట్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. రక్షణ గ్రిల్స్ అసంపూర్తి పనులతో నిర్మించి నిర్లక్ష్యంగా వదిలేశారు.

– రాంబాబు, వాహనదారుడు, ఊర్వశికూడలి

అధికారులు స్పందించాలి



గ్రీన్‌బెల్ట్‌లు ఆక్రమణలకు గురవుతుండడం, పచ్చని చెట్లు తొలగించి ఆయా ప్రాంతాల్లో కొందరు వ్యాపారాలు చేస్తున్నారు. అడిగే నాథుడు లేకపోవడంతో గ్రీన్‌బెల్ట్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. జోన్ పరిధిలో గ్రీన్‌బెల్ట్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి, రక్షణ లేని గ్రీన్ బెల్ట్‌లు సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి

– సొండి సురేష్, స్థానికుడు, ఆశోక్‌నగర్, కంచరపాలెం

11న 'హలో డ్రైవరన్న చలో కలెక్టరేట్'


సీతమ్మధారలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా ఆటో ఫెడరేషన్ నాయకులు

తాటిచెట్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని జిల్లా ఆటో ఫెడరేషన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. దీనిలో భాగంగా ఈ నెల 11న 'హలో డ్రైవరన్న చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ తెలిపింది. దీనికి సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం షిర్డీ సాయి ఆటో స్టాండ్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. మధురెడ్డి మాట్లాడుతూ ఓలా, ఉబర్, రాపిడో వంటి ఆన్‌లైన్ యాప్‌లు, ఇప్పుడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటో కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులకు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న ఉదయం 9 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు జరగనున్న భారీ ర్యాలీలో ఆటో డ్రైవర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సన్యాసిరావు, నర్సింగ్, గంగూలి, లక్ష్మణ్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

తాటిచెట్లపాలెం: భారత ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్ ఘన విజయం సాధించడంతో ఉత్తర నియోజకవర్గంలోని బీజేపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. రాధాకృష్ణన్ 98.2 శాతం పోలింగ్‌తో 452 ఓట్లు సాధించినట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకొని అభినందనలు తెలియజేసుకున్నారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకుడు సురేష్, బీజేపీ నాయకులు సునీల్ అగర్వాల్, శ్యామలదీపిక హర్షం పాల్గొన్నారు.

బనారస్ రైలుకు అంకోరా స్టేషన్‌లో హాల్ట్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–బనారస్–విశాఖపట్నం(18523/18524) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 11వ తేదీ నుంచి అంకోరా స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నారు. విశాఖపట్నం–బనారస్(18523) ఎక్స్‌ప్రెస్ అంకోరా స్టేషన్‌కు ఉదయం 5.08 గంటలకు చేరుకుని 5.10 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో బనారస్–విశాఖపట్నం(18524) ఎక్స్‌ప్రెస్ అంకోరా స్టేషన్‌కు సాయత్రం 6.40 గంటలకు చేరుకుని 6.42 గంటలకు బయల్దేరుతుంది.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

దాబాగార్డెన్స్: డయల్ యువర్ ఆర్ఎం పేరిట బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. కాకినాడ, రాజమండ్రి సెక్టార్స్ వారు కూడా డయల్ యువర్ ఆర్ఎం కార్యాక్రమంలో పాల్గొని సలహాలు, సందేహాలు ఇవ్వొచ్చు. ఆసక్తి గల వారు 9959225580 నెంబరుకు డయల్ చేయాలన్నారు.

క్లుప్తంగా

యోగ సిద్ధాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: మురళీనగర్ జాతీయ రహదారిలోని సూర్యనగర్ 2లో ఉన్న యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు అరవిల్లి శ్రీకాంతాచార్యుడి ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో ఈ పూజలు జరిగాయి. స్వామివారికి సింధూర అర్చన చేసి, ధూప, దీప నైవేద్యాలు, మంత్రపుష్పం సమర్పించారు. యోగ సిద్ధాంజనేయుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సామూహికంగా సుందరకాండ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పెనుమత్స సుబ్బరాజు, ఆలయ కమిటీ సభ్యులు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రూ.88.9 లక్షలతో పార్కుల అభివృద్ధి


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 14వ వార్డు పరిధిలోని పలు పార్కుల అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజుతో కలిసి ఆయన సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని హిల్ వ్యూ పార్క్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ పనుల కోసం మొత్తం రూ88.90 లక్షల ఖర్చు చేయనున్నారు. సృజని పార్క్, ఆర్అండ్‌బీ క్వార్టర్స్ పార్క్, హిల్ వ్యూ పార్క్‌లలో కాంపౌండ్ వాల్ నిర్మాణం, వాచ్‌మన్ రూమ్, పార్క్ మరమ్మతులు, వాష్‌రూమ్‌లు, ప్రహరీ ఎత్తు పెంచడం, పిల్లల ఆట వస్తువుల ఏర్పాటు వంటివి ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా ఉన్నాయి. కార్యక్రమంలో కూటమి నాయకులు శ్యామలదీపిక, నజీర్, ప్రకాశరావు, హేమ, హరిత, కల్యాణ్, మరియు పార్క్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ అందించాలి

మద్దిలపాలెం : గిరిజన యువతను సాధికారత దిశగా నడిపించే విధంగా నైపుణ్య శిక్షణ అందించాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ యువతలో నైపుణ్యాలను పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. సాధారణ విద్యతోపాటు ప్రత్యేకమైన నైపుణ్యాలు అందించే శిక్షణ కార్యక్రమాలను ఆదివాసీ యువత కోసం నిర్వహించాలని సూచించారు.

సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఏయూ క్యాంపస్ : కేంద్ర మత్స్య సాంకేతిక పరిశోధన సంస్థ (సీఐఎఫ్‌టీ) ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో భారతీయ మత్స్య పరిశ్రమలో గేర్ మార్కింగ్ – అవకాశాలు, సవాళ్లు అంశంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించడం అత్యంత అవసరమన్నారు. సవాళ్లు, ఆచరణాత్మక పరిష్కారాల దిశగా ఆలోచించేందుకు గేర్ మార్కింగ్ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. గేర్ మార్కింగ్‌పై జాతీయ మార్గదర్శకాలను రూపొందించడానికి మత్స్యకారులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను స్వేచ్ఛగా పంచుకోవాలని సూచించారు. ఐసీఏఆర్ – సీఐఎఫ్‌టీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్.రఘు ప్రకాష్ మాట్లాడుతూ గేర్ మార్కింగ్‌పై ప్రపంచ స్థాయిలో జరుగుతున్న విధానాలను వివరించారు. చట్ట విరుద్ధంగా చేపల వేటను తగ్గించడానికి, వివాదాలను పరిష్కరించడానికి ఒక సాధనంగా నిలుస్తుందన్నారు. గేర్ మార్కింగ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉపయోగించే రంగుల కోడింగ్‌తోపాటు అధునాతన రేడియో ఫ్రీక్వెన్సీ(ఆర్ఎఫ్) ట్యాగ్‌ల వినియోగం, తదితర అంశాలను వివరించారు.

45వ వార్డు అధ్యక్షుడిగా భరణికాన రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడుగా, సత్యసాయినగర్ గ్రామ అధ్యక్షుడు భరణికాన రాజు యాదవ్, సెక్రటరీగా సీలాపు రామిరెడ్డిలు ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన ఎంపీ శ్రీభరత్‌కు, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలియజేశారు.

మ్యాన్‌హోల్ పునరుద్ధరణ


శ్రీనగర్‌లోరెడ్డి ఆస్పత్రి కూడలి వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ మ్యాన్‌హోల్

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: స్థానిక శ్రీనగర్ రోడ్డులో ఉన్న రెడ్డి ఆస్పత్రి కూడలి వద్ద శిథిలమైన డ్రెయిన్ మ్యాన్‌హోల్ స్థానంలో జీవీఎంసీ అధికారులు కొత్త సిమెంట్ మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ ఉన్న ఇనుప గ్రిల్ తుప్పు పట్టి విరిగిపోవడంతో రోడ్డు మధ్యలో ప్రమాదకరమైన గొయ్యి ఏర్పడింది. ఈ సమస్యపై 'సాక్షి' లో ఈ నెల 7వ తేదీన 'డ్రెయిన్ కల్వర్టు శిథిలం' శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు వెంటనే స్పందించారు. శిథిలమైన ఇనుప గ్రిల్ స్థానంలో సిమెంట్ పలకలతో కూడిన మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు, వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు


సమావేశంలో మాట్లాడుతున్న కేకే రాజు

తాటిచెట్లపాలెం: బూత్ స్థాయిలో పార్టీ కమిటీలను త్వరగా ఏర్పాటు చేసి, ప్రజలను సమన్వయం చేసుకుని పార్టీని బలోపేతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గంలోని 14, 24, 25వ వార్డులకు చెందిన కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై పోరాటం చేసినప్పుడే నిజమైన నాయకుడిగా గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. 2024 ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి అనేక మోసపూరిత హామీలు ఇచ్చి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ఎండగట్టేందుకు 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలన, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని కోరారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని స్థితిలో ఉన్నారని, అందుకే ప్రతి ఇంటికి వెళ్లి ఈ కార్యక్రమం ద్వారా వారికి జరిగిన మోసాన్ని తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్రావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సాడి పద్మారెడ్డి, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్ హల్‌చల్

- ఇంటి తలుపు కొడుతూ మహిళలను ఇబ్బంది పెట్టిన వైనం
- ఇద్దర్ని అరెస్టు చేసిన పోలీసులు

మర్రిపాలెం: జ్ఞానాపురం వద్ద ఒకే కుటుంబానికి చెందిన మహిళలు నివాసముంటున్న ఇంట్లో సోమవారం రాత్రి ఇద్దరు యువకులు తలుపులు, కిటికీలు కొట్టడంతో భయాందోళనలకు గురైన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితుల వివరాల ప్రకారం జ్ఞానాపురం నికోలస్ వీధిలో ఒక మహిళ, ఆమె కుమార్తె, ఇద్దరు మనుమరాళ్లు,మనవడితో కలిసి నాలుగు అంతస్తుల భవనంలో మూడో ఫ్లోర్‌లో అద్దెకు ఉంటున్నారు. రాత్రి 9 గంటల తర్వాత, దిగువ పోర్షన్‌లో ఉంటున్న వారిని చూడటానికి వచ్చిన ఇద్దరు యువకులు, వాళ్లు లేకపోవడంతో మూడో ఫ్లోర్‌లోని మహిళల ఇంటికి వచ్చి తలుపులు కొట్టారు. ఎవరని ప్రశ్నించినా చెప్పకుండా ఇబ్బంది పెట్టారు. దీంతో భయపడిన ఆ మహిళలు ఇంటి యజమాని పీలా శ్రీనివాసరావుకు ఫోన్ చేశారు. ఆయన తన కుమారుడితో కలిసి అక్కడికి వచ్చారు. మహిళలు దగ్గరలో ఉన్న కిరాణా షాపు యజమానికి ఫోన్ చేయగా, అతను వచ్చి ఆ యువకులను తన షాపు వద్దకు తీసుకెళ్లాడు. ఇంతలో ఇంటి యజమాని శ్రీనివాసరావు అక్కడికి చేరుకుని, ఎందుకు మహిళలను ఇబ్బంది పెడుతున్నారని ఆ యువకులను ప్రశ్నించాడు. దీంతో వాగ్వాదం జరిగి, ఆ ఇద్దరు యువకులు శ్రీనివాసరావుపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు శ్రీనివాసరావును, ఆయన కుమారుడు పూర్ణ సాయిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వెంటనే కంచరపాలెం పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేలోగా నిందితులు పరారయ్యారు. దాడికి పాల్పడిన వారిని దేవర కల్యాణ్, దుర్గాప్రసాద్ అలియాస్ పులిగా పోలీసులు గుర్తించారు. దేవర కల్యాణ్ గంజాయి కేసులో నిందితుడిగా ఉండి ఇటీవల జైలు నుంచి విడుదలయ్యాడని, దుర్గాప్రసాద్‌పైనా కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. నిందితులను మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్టు పోలీసులు వెల్లడించారు.

అవగాహన లేక బీమా పొందలేకపోతున్నారు


ఖాతాదారునికి చెక్కు అందజేస్తున్న గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ చిరంజీవి

తాటిచెట్లపాలెం: ప్రజలకు బ్యాంక్ సేవలు, బీమా పథకాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏపీ గ్రామీణ బ్యాంక్ కైలాసపురం బ్రాంచ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. విశాఖ రీజినల్ మేనేజర్ చిరంజీవి వెంకటేష్ మాట్లాడుతూ అవగాహన లేకపోవడం వల్ల చాలామంది ఖాతాదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని తెలిపారు. ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన పల్లివెల అక్కమ్మ భర్త పల్లివెల వెంకటేశ్వరరావుకు రూ.10 లక్షల బీమా చెక్కును అందజేశారు. అక్కమ్మ కేవలం రూ.500 చెల్లించి ఎస్‌బీఐ జనరల్ బీమా చేయించుకున్నారని, ఆమె మరణానంతరం ఆ బీమా మొత్తాన్ని కుటుంబానికి అందించినట్లు మేనేజర్ తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ వాహనాలు, గృహోపకరణాలకు బీమా చేయిస్తున్నాం కానీ, మన జీవితాలకు బీమా చేసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ మేనేజర్ సురేష్, సీవో వరలక్ష్మి, బ్యాంక్ సిబ్బంది, ఇతర ఖాతాదారులు పాల్గొన్నారు.

'గబ్బిలం' మానవీయ సాహిత్యానికి ప్రతీక


మాట్లాడుతున్న రచయిత గుంటూరు లక్ష్మీ నర్సయ్య

సీతంపేట: మహాకవి జాషువా జయంతిని పురస్కరించుకుని సమతా సాహితి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 'మానవీయ సాహిత్య చిహ్నం జాషువా గబ్బిలం' అనే అంశంపై సాహిత్య సభ జరిగింది. ఈ సభకు డాక్టర్ మాటూరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో కులవివక్ష ఉన్నంత కాలం 'గబ్బిలం' వంటి కావ్యాలు వస్తూనే ఉంటాయని తెలిపారు. ముఖ్య అతిథి గుంటూరు లక్ష్మీ నర్సయ్య మాట్లాడుతూ 'గబ్బిలం' కావ్యం బహుజన తాత్విక చింతనను ప్రతిబింబించిందని, ఇది మానవీయ విలువలతో కూడిన గొప్ప కావ్యమని కొనియాడారు. డాక్టర్ కేవీఎస్ మూర్తి మాట్లాడుతూ, 'గబ్బిలం'లోని గొప్ప మానవీయ విలువల కారణంగానే అది ఇప్పటికీ ప్రజల మదిలో నిలిచి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

గిగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి


బైకు ర్యాలీ నిర్వహిస్తున్న స్విగ్గీ,జొమాటో రైడర్స్

సీతంపేట: స్విగ్గీ, జొమాటో వంటి ప్లాట్ ఫామ్‌లలో పనిచేసే రైడర్స్ (గిగ్ వర్కర్స్) తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం డైమండ్ పార్కు నుంచి కాంప్లెక్స్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ జిల్లాలో ఏడేళ్లుగా సుమారు 40 వేల మంది యువత ఈ ప్లాట్‌ఫామ్‌లలో పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అక్రమంగా తొలగించిన ఐడీలను తిరిగి పునరుద్ధరించాలని, 8 గంటలు ఆన్‌లైన్‌లో ఉంటే కనీస హామీ ఆదాయం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 365 రోజులు ఒకే రకమైన రేటు, ఇన్సెంటివ్, కిలోమీటర్‌కు ఎంత రేటు ఇస్తారో యాప్‌లో స్పష్టంగా చూపించాలని కోరారు. బేస్ పేను రూ.30కి పెంచాలని, గతంలో ఇచ్చినట్లుగా పీక్ అవర్స్‌లో రూ.12, నాన్–పీక్ అవర్స్‌లో రూ.10 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇన్సెంటివ్‌కు రెండు పిక్స్ తప్పనిసరి చేయకూడదని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి లేబర్ కమిషనర్ జోక్యం చేసుకోవాలని, యాజమాన్యాలతో మాట్లాడి పరిష్కారం చూపాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే ప్రతి వారం శని, ఆదివారాల్లో సేవలను బంద్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.ఎం.కుమార్ మంగళం, పెద్ద సంఖ్యలో రైడర్స్ పాల్గొని తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

435 మంది ఏయూ విద్యార్థులకు ఉద్యోగాలు


ఎంపికైన విద్యార్థులతో వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో భాగంగా ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగాల నుంచి 435 మంది విద్యార్థులు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు. వాణిజ్యం, నిర్వహణ అధ్యయనాల విభాగం నుంచి 205 మంది ఎంపికయ్యారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 18 మందిని మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా నియమించుకుంది. ఎంపికైన విద్యార్థులకు ఆఫర్ లెటర్లను వీసీ ఆచార్య రాజశేఖర్ తన కార్యాలయంలో మంగళవారం అందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాంబాబు, డీసీఎంఎస్ అధిపతి ప్రొఫెసర్ జె.రవి, సౌత్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ వి.ఆర్.రెడ్డి, డాక్టర్ మోహన్ గణేష్ పాల్గొన్నారు.

యూజీడీ లీకుతో అవస్థలు


శాంతిపురంలో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు శాంతిపురంలో కైట్స్ కళాశాల వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకై మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో స్థానికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాకాలంగా ఈ సమస్య కొనసాగుతున్నా, దీనికి శాశ్వత పరిష్కారం లభించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంతిపురం ప్రధాన రహదారిలో ఉన్న మ్యాన్‌హోల్ నుంచి నిరంతరం మురుగు నీరు పొంగి పొర్లుతోంది. ఈ మార్గంలో రోడ్డుపై మురుగు ప్రవహించడంతో దుర్వాసన వెదజల్లుతూ, ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లేలా చేస్తోంది. ఈ రోడ్డు గుండా ప్రతిరోజు వందలాది మంది విద్యార్థులు, స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. మురుగునీటి వల్ల దోమలు, ఇతర కీటకాలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె శోభారాణి, ఏఈవో రాజేంద్రకుమార్, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com